పశువుల లెక్క తేలేనా ?

- కొనసాగుతున్న పశుగణన
- మండలంలో ఇప్పటి వరకు 30 శాతం పూర్తి
- ప్రతి ఐదేళ్లకోసారి లెక్కింపు


పశుగణన పోస్టర్‌తో గొర్రెలు, మేకల పెంపకం దారులు

పెనుగంచిప్రోలు: జాతీయ పశుగణన కార్యక్రమం మండలంలో కొనసాగుతోంది. అయితే పశుపోషకులు సక్రమంగా సహకరించకపోవడం వల్ల జాప్యం చోటుచేసుకుంటుందని అధికారులు అంటున్నారు. పాడి పరిశ్రమ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 21వ అఖిలభారత జాతీయ పశుగణన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈసర్వేతో పశు పోషకులకు మేలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి చేపట్టనున్న ఈగణన ఈ ఏడాది అక్టోబర్ 25న మొదలై ఫిబ్రవరి, 2025 వరకు జరగనున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మండలంలో 15 గ్రామాల్లో సర్వే.....

మండలంలోని 15 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 30 శాతం మాత్రమే సర్వే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలో సర్వే చేస్తున్న వారిలో ముగ్గురు సూపర్‌వైజర్లు, గోపాలమిత్ర ఒకరు. వెటర్నరీ సహాయకులు, ఎమ్యూనరేట్లు 10 మంది ఉన్నారు. వీరందరూ ఇంటింటికి తిరిగి సర్వే చేయటంతో పాటు సర్వే జరిగినట్లు ఇంటి వద్ద స్టిక్కర్ అంటిస్తున్నారు. ఈకార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు ఎమ్యూనరేటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారంతా పశుగణన సర్వేలో పాల్గొంటున్నారు. ముఖ్యంగా పాల ఉత్పత్తి, మాంసం ఉత్పత్తి ఎంత వస్తుందో సర్వే ద్వారా తెలుస్తుంది. పశువులకు అవసరమైన మందుల బడ్జెట్ అంచనా వేసుకోవచ్చు.

పశుగణన ద్వారా ప్రయోజనాలు...

పాడి, కోళ్ల పరిశ్రమలు, గొర్రెలు, మేకలు పెంపకం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఈగణన ద్వారా పశువుల అభివృద్ధికి విధి విధానాల రూపకల్పన, పశు ఆరోగ్య నిర్వహణ, పాడి పరిశ్రమకు అవసరమైన మౌలిక వసతుల గుర్తింపు జరుగుతుంది. పథకాల అమలుకు దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పాడిపరిశ్రమ అభివృద్ధి చేయటానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు పశుగణన దోహదం చేస్తుందని పశుసంవర్ధక శాఖ అధికారులు అంటున్నారు.

2019లో గణన ప్రకారం మండలంలో పశు సంపద...	
పశువులు	13,745
గొర్రెలు	12,413
మేకలు	4239
కుక్కలు	85
పౌల్ట్రీకి సంబంధించి	
కోళ్లు, పందులు వగైరా	67,032
మొత్తం	97,514

పశు పోషకులు సహకరించాలి



శిక్షణ తీసుకున్న ఎన్యూమరేటర్లు, పశువైద్యాధికారుల పర్యవేక్షణలో పశుగణన జరుగుతుంది. గణనలో చిన్నపాటి తేడా కూడా లేకుండా వివరాలను లెక్కించి ప్రత్యేక యాప్ భారత్ పశుదాన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. సర్వే ఆధారంగా పశుసంరక్షణ ఆరోగ్య పథకాలు, రాయితీలపై ప్రభుత్వం సులభంగా నిర్ణయం తీసుకునే వీలుంటుంది. సర్వేకు పశుపోషకులు సహకరించాలి. –పి.అనిల్, పశువైద్యాధికారి

క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలందించాలి



నందిగామ టౌన్: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఏసీపీ తిలక్ తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను రోగులు, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులకు సత్వర వైద్యమందించటంతో పాటు వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. అంతే కాకుండా ఇన్‌పేషంట్స్‌కు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం ఓపీ, పురుషులు, మహిళలు, పిల్లల వార్డు, పీపీ యూనిట్, ల్యాబ్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



పెనుగంచిప్రోలు: సేవా కార్యక్రమాలు అభినందనీయమని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంఈవో డి.రవీంద్ర తెలిపారు. ముత్తూట్ మినీ ఫైనాన్స్ బ్రాంచి వారు తుఫాన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ప్లేట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు గతంలో విద్యార్థులు గొడుగులు కూడా అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభావతి, ముత్తూట్ ఫైనాన్స్ ఏపీ హెడ్ కె.కన్నబాబు, జోనల్ మేనేజర్ నిరంజన్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ వంశీ, బ్రాంచ్ మేనేజర్ ఎస్. వీరాస్వామి పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి




వీరులపాడు: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న విజయవాడలో చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త ధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కమల పిలుపునిచ్చారు. వీరులపాడులోని శనివారం వీవోఏల మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (వీవోఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌పై కూటమి ప్రభుత్వం మాట తప్పిందని తెలిపారు. అంతే కాకుండా మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ ఆధారంగా మూడేళ్లు పూర్తయిన వీవోఏలను మార్చుకోవచ్చని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడటం సమంజసం కాదని చెప్పారు. షేక్ చాంద్‌బేగం, ఆళ్ల ఉమాదేవి, లాల్ అహ్మద్ గౌస్, సుజాత, కవిత, నాగమ్మ, సుష్మిత, స్వాతి, ప్రశాంతి పాల్గొన్నారు.

విద్యుత్ పోరుకు సిద్ధం కావాలి



వీరులపాడు: విద్యుత్ బిల్లుల పెంపుపై మాట తప్పిన కూటమి ప్రభుత్వ తీరు, పెరిగిన విద్యుత్ బిల్లులపై పోరుకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట కళ్యాణ్ తెలిపారు. వీరులపాడు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కూడా గడవకముందే రూ. 15,484 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. సర్దుబాటు చార్జీల భారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు రాజకీయ పార్టీలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. లాల్ అహ్మద్ గౌస్, చాట్ల రవి, పల్లెకంటి బాబు, అద్దంకి స్వామి, గుంజి వీరయ్య, చాంద్‌బేగం, గడ్డం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



నందిగామ టౌన్: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, అశేష భక్త జనసమూహం నడుమ అర్చకులు శనివారం వైభవంగా జరిపించారు. ముందుగా స్వామి వారిని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 500 మంది దంపతులు పీటలపై కూర్చుని సామూహిక పూజలు చేశారు. అనంతరం ఐదు వేల మందికి భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్, పక్కన సర్పంచ్ పద్మకుమారి, జెడ్పీటీసీ నాగమణి, తదితరులు


నందిగామ జెడ్పీ పాఠశాల సమావేశంలో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

పెనుగంచిప్రోలు: విద్యార్థులు వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయుల మార్గదర్శకంలో ఉన్నతంగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన పేరెంట్స్-టీచర్స్ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు పొందాలని సూచించారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, ఎంపీడీఓ జి.శ్రీను. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎంఈఓ డి.రవీంద్ర, ఎస్‌ఎంసీ చైర్మన్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ టౌన్: ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యాబోధన చేయటమే కాకుండా విద్యార్థులకు క్రమశిక్షణ, వ్యక్తిత్వవర్ధన నేర్పించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఏసీపీ తిలక్, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, తహసీల్దార్ సురేష్‌బాబు పాల్గొన్నారు. అడవిరావులపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ ఆకుల హనుమంతరావు పాల్గొన్నారు. చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ముందుగా విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ సందేశాన్ని వినిపించారు.

నందిగామ టౌన్: విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం వెంకట నారాయణ, ఎంపీడీవో అరుంధతీ దేవి, ఎంఈవో పాల్ కెనడీ, సర్పంచ్ బందెల రాణి, ఎంపీటీసీ సభ్యురాలు బాయమ్మ, పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు చిత్తశుద్ధితో కృషిచేయాలని మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం శ్రీరఘురాం అన్నారు. పట్టణంలోని జీవీజే జెడ్పీ బాలుర హైస్కూల్, సీతారామపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం మెగా పేరెంట్, టీచర్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య తిథిగా స్కూల్ పూర్వ విద్యార్థి, మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం శ్రీరఘురాం పాల్గొని ముందుగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్ డీసీపీ సీఎస్‌డబ్ల్యు ఎస్‌డీవీ ప్రసాద్ పాల్గొని డ్రగ్స్, గంజాయి వలన జరిగే అనర్థాలను, చట్టాలు, శిక్షల గురించి వివరించారు. అనంతరం తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి విజేతలకు డీసీపీ బహుమతులు అందజేశారు. బాలుర హైస్కూల్ హెచ్‌ఎం. మాధవీలత, ఎస్‌ఎంసీ చైర్మన్ శేషం అనురాధ, పాల్గొన్నారు. గిరిజన బాలుర గురుకుల పాఠశాల, బలుసుపాడు రోడ్‌లోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, పట్టణంలోని జడ్పీ బాలికల, బాలుర హైస్కూల్స్ తదితర పాఠశాలల్లో విజయవాడ పోలీస్ కమిషనరేట్ డీసీపీ సీఎస్‌డబ్ల్యు ఎస్‌డీవీ.ప్రసాద్, పట్టణ ఎస్ఐ జి.రాజు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, బాలికల హైస్కూల్ హెచ్‌ఎం. లక్ష్మి, బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.సుజాత, ట్రైబల్ బాలుర గురుకుల ప్రిన్సిపాల్ టి.ఉమేష్‌బాబు, పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. 6 వ వార్డులోని మండల పరిషత్ పాఠశాలలో శనివారం జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీట్ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. స్కూల్ హెచ్‌ఎం వాణి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, సామాజికవేత్త కర్లపాటి శ్రీను, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంచికచర్ల : విద్యార్థులు ఉన్నతంగా చదవాలంటే తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మండలంలోని పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలలకు వెళ్లుతున్నారా లేదా గమనించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారా లేదాని తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, సంస్కారం నేర్పించాలన్నారు. విద్యార్థులకు సమగ్ర విద్యా ప్రగతి పత్రాలు, ఆరోగ్య రికార్డులను పంపిణీ చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈఓ బీ బాలాజీ, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నందిగామ టౌన్: విద్యార్థులు మత్తు పదార్థాలు, అసాంఘిక వ్యసనాలకు దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలని విజయవాడ డీసీపీ మహేశ్వరరాజు తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్‌ల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. రానున్న భవిష్యత్ నేటి విద్యార్థులపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల వ్యవహారశైలిపై దృష్టి సారించి పెడదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాల జోలికి వెళ్లమని, చెడు వ్యసనాలకు అలవాటు పడబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐ వైవీఎల్ నాయుడు, పలువురు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డం సేవలు మరువలేనివి

నందిగామ టౌన్: మండలంలోని అడవిరావులపాడు గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పీఆర్టీయూ నాయకుడు గడ్డం నారాయణరావు సేవలు మరువలేనివని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం నారాయణరావు దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పావతి, బెనర్జీ, రాజ్యలక్ష్మీ, మానస, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు వసతుల కల్పనే ధ్యేయం


పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ఈఓ కిషోర్‌కుమార్

పెనుగంచిప్రోలు: భక్తులకు మౌళిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయమని చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో బీహెచ్‌వీఎస్‌ఎన్ కిషోర్‌కుమార్ తెలిపారు. గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ పాలకవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలు ఆమోదించటంతో పాటు పలు అంశాలపై చర్చించారు. అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో గార్డెనింగ్ విస్తరణ, పాపమాంబ వనం నందు, దేవస్థానం చుట్టూ స్టీల్ లైట్ పోల్స్ ఏర్పాటుకు రూ.37.50 లక్షలుతో అంచనాలు ఆమోదించారు. అలాగే నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో ఏసీ ఏర్పాటుకు రూ.45 లక్షలు, మినీ ఫంక్షన్ హాల్స్, కల్యాణ మండపంలో జనరేటర్స్ ఏర్పాటుకు రూ.83 లక్షలు, డైనింగ్ హాల్, కిచెన్, జనరేటర్ గది నిర్మాణానికి రూ.2.50 కోట్లుతో అంచనాలు ఆమోదించామని చెప్పారు. అలాగే అమ్మవారి ఆలయంలో సంతాన లక్ష్మి పూజ టికెట్ రూ.100 నుంచి రూ.200కు పెంపు, నూతన ఆర్జిత సేవగా వేద ఆశీర్వచనం టికెట్ రూ.500 ఏర్పాటుకు దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక పంపటంపై ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఈఈ ఎల్ రమ, ఏఈఓ ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ


సిబ్బందికి మెటీరియల్ అందజేస్తున్న డీఈఈ శ్రీనివాస్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఉన్న విద్యుత్ ఇండోర్ సబ్ స్టేషన్‌లో విద్యుత్‌శాఖ డీఈఈ శ్రీనివాస్ శనివారం జగ్గయ్యపేట, చిల్లకల్లు ఓ అండ్ ఎం సిబ్బందికి విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఓ అండ్ ఎం మెటీరియల్ అందజేశారు.

ఓరియెంటెడ్ ఇంగ్లీష్ సమాచార యాప్ ఆవిష్కరణ



యాప్ ఆవిష్కరిస్తున్న రామ్మోహనరావు, మల్లికార్జునరావు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో కేంబ్రిడ్జి ఇంగ్లీష్ సమాచార యాప్‌ను కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.రామ్మోహనరావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంబ్రిడ్జి యూనివర్సిటీ అసెస్మెంట్ అండ్ ప్రెస్ సభ్యులు పి.మల్లికార్జున నాయుడు మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా ప్రస్తుత ఆంగ్ల పరిజ్ఞానాన్ని తద్వారా లాంగ్వేజ్ స్కిల్స్ పెంచుకోవచ్చని తెలిపారు.

ఈ యాప్ ఇన్‌స్టాలేషన్ దీనిలోని కాన్సెప్ట్ నేర్చుకునే పద్ధతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ పి. చిరంజీవి, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ హేమకృష్ణశాస్త్రి, పాలిటెక్నిక్ ఇన్‌చార్జి సీహెచ్ చిన్నవీరయ్య, ఎన్. భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలి


పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి విజయకుమారి

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): దాళ్వా సీజన్‌లో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి డీఎమ్‌ఎఫ్ విజయకుమారి తెలిపారు. గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో దాళ్వా సీజన్‌పై జిల్లా స్థాయిలో శనివారం వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాళ్వా సీజన్‌లో పంటల సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం ప్రాంతాల్లో వరి సాగు చేసే రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సాగునీరు తక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులకు వివరించాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణంరాజు, కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, మైలవరం, విస్సన్నపేట, విజయవాడ ఏడీఏలు భవాని, కెనడి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఏవోలు, తదితరులు పాల్గొన్నారు. మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి విజయకుమారి పరిశీలించారు. పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్మకానికి తెచ్చుకునే ముందుగానే ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలు తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మద్దతు ధర క్వింటాకు రూ.7521 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఆరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. బూదవాడ గ్రామానికి చెందిన ఆవుల గంగయ్య ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.50 వేలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే నివాసంలో చెక్కును లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు తాతయ్య అందజేశారు.